భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- ముస్లింల భారీ ర్యాలీలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

గుంతకల్లుటౌన్/తాడిపత్రి రూరల్/పెద్దపప్పూరు/యాడికి/గుత్తి/పామిడి: గుంతకల్లు పట్టణంలో మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు మసీదులు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం పోర్టర్స్‌లైన్‌లోని హజరత్ గులామ్‌షా ఖాద్రీ బాబా దర్గాలో పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్, అదనపు ఖాజీ సత్తార్‌సాబ్, తదితర మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు జెండా ఊపి ర్యాలీ(జులూస్) ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై మక్కా, మదీనా నమూనాలు, ఇస్లామిక్ జెండాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జమాత్-ఏ-ఇస్లాయే మిల్లత్ కమిటీ, అంజుమన్ కమిటీల పెద్దలతో పాటు పట్టణంలోని మసీదు కమిటీల పెద్దలు, భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. పోర్టర్స్‌లైన్ దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ యువనేత సి.బి.మంజునాథరెడ్డి పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఊరేగింపులో పాల్గొన్నారు.

▸▸ తాడిపత్రి పట్టణంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ పండుగ వైభవంగా నిర్వహించారు. ముస్లింలు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌బాషా, మత పెద్దల పాల్గొన్నారు.

▸▸ పెద్దపప్పూరులో ముస్లింలు ర్యాలీ అనంతరం జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి నిరుపేదలకు అన్నదానం చేశారు.

▸▸ యాడికి మండల కేంద్రంతో పాటు రాయలచెరువు గ్రామంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. జామియా మసీదు వద్ద అన్నదాన చేశారు.

▸▸ గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మక్కా మసీదు నమూనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదులో మహమ్మద్ ప్రవక్త కేశాలను వీక్షించడానికి ముస్లింలు బారులు తీరారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పండుగ విశిష్టతను వివరించారు.

▸▸ పామిడిలో శుక్రవారం ముస్లింలు ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆకుపచ్చ జెండాలు ధరించి ర్యాలీ నిర్వహించారు.


గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


గుత్తిలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


పెద్దపప్పూరులో ర్యాలీ చేస్తున్న ముస్లింలు


పామిడిలో ముస్లింల ర్యాలీ


యాడికిలో..


తాడిపత్రిలో ముస్లింలతో కలసి ర్యాలీలో పాల్గొన్న రమేష్‌రెడ్డి, ఫయాజ్‌బాషా


గుంతకల్లులోని పోర్టర్స్‌లైన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత మంజునాథరెడ్డి, మైనార్టీ నాయకులు


గుంతకల్లులో మక్కా మదీనా నమూనా

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్లను గురువారం కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామి ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కసాపురం రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు సీనియర్ క్రికెటర్ల సహాయ సహకారంతో నిర్వహిస్తున్న టోర్నీ కసాపురం రోడ్డులోని మారుతీ నగర్‌లో ప్రారంభించనున్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన జట్లు ఈ నెల 25లోపు పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

వ్యక్తి మృతి


మృతిచెందిన రమేష్

గుత్తి: ఉరవకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన రమేష్ (33)గురువారం తన అత్తారింటికి గుత్తికి వచ్చాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుత్తి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన


అధికారులతో మాట్లాడుతున్న కార్మికులు

తాడిపత్రి రూరల్: గుత్తి మండలం జక్కలచెరువు వద్ద ఆర్టీసీ డ్రైవర్, కండెక్టర్లు బాలచంద్ర, అనిల్‌కుమార్‌పై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం ఆర్టీసీ కార్మికులు 53 బస్సులను నిలిపి నిరసన వ్యక్తం చేశారు.స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్లు, కండెక్టర్లు, కార్మికులు కలసి బస్సులను నిలిపి ఆందోళనకు దిగారు. నిందితుల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా ఉన్నారని, వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కార్మికులతో పోలీసులు, ఆర్టీసీ అధికారులు చర్చలు జరిపి నిరసనను నిలుదల చేయించారు. అనంతరం యథావిధిగా బస్సులు నడిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శింగనమల(నార్పల): నార్పలలో శుక్రవారం ఎఫ్ఎస్‌సీఎస్, శ్రీతిరుమలట్రేడర్స్, వెంకటేశ్వర కెమికల్స్ , లక్ష్మీ గణేష్ ఎరువుల దుకాణాలను శింగనమల, నార్పల తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. రికార్డులు, యూరియా స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు ఎంఆర్‌పీకి మాత్రమే ఎరువలు విక్రయించాలని సూచించారు. నార్పల మండలానికి 40 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శేషారెడ్డి, అరుణకుమారి, ఏఓ చెన్నవీరస్వామి, సీఎస్ డీటీ చంద్రకళ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేసుకున్న గ్రామస్తులు


గుంతలకు మట్టి వేసుకుంటున్న గ్రామస్తులు

శింగనమల: నార్పల మండలంలోని పూలసలనూతల గ్రామస్తులు స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు చేసుకున్నారు. వివరాలు.. గ్రామానికి రోడ్డు గుంతలమయంగా మారడంతో అధికారులు, నాయకుల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఎవరూ పట్టించుకోక పోవడంతో... గ్రామస్తులే ట్రాక్టరులో ఎర్ర మట్టిని తెచ్చుకుని రోడ్డు మరమ్మతులు చేసుకుంటున్నారు. గ్రామ రహదారిని ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


తాడిపత్రిలో టీచర్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం


యాడికిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు


తాడిపత్రిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో శుక్రవారం టీచర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ హెచ్ఎం సత్యనారాయణ, అశ్వర్థరెడ్డిని శాలువాలు, పూలహారాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, విజయభాష్కర్‌రెడ్డి, రమణమహర్షి ఆశ్రమం బ్రహ్మం పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలో శుక్రవారం 30 మంది ఉపాధ్యాయులను బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెన్నానది ఒడ్డున టీచర్లకు శాలువలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి ఓబిరెడ్డి, రంగనాయకులు పాల్గొన్నారు.

యాడికి: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని రాయలచెరువు గ్రామంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మల్లికార్జున శెట్టి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నబీరసూల్, చిన్నపెద్దన్న, బాల వెంకటేష్‌ను సన్మానించారు. మిలాద్ ఉన్ నబి సందర్భంగా లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత మధుమేహ శిబిరంలో 60 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దంపతులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

పెద్దపప్పూరు/యాడికి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగాపెద్దపప్పూరు మండలంలోని పెద్దయక్కలూరు, గార్లదిన్నె పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రవీంద్ర, ఆశా దంపతులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. ఎంఈఓలు రవీంద్రకుమార్, ఓబులపతితోపాటు సహ ఉపాధ్యాయులు వారిని అభినందించారు.


ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయ దంపతులు రవీంద్ర, ఆశా

అలాగే మండలంలోని వెంగన్నపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం క్రిష్ణమోహన్ రెడ్డి, రాయలచెరువు ఉన్నత పాఠశాల హెచ్ఎం డేనియల్‌ను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.



అవార్డులు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్‌రెడ్డి, డేనియల్

పరామర్శ


దాడి తోట బాషాను పరామర్శిస్తున్న సాకే శైలజనాథ్

శింగనమల(నార్పల): నార్పల మండల మాజీ కోఆప్షన్ మెంబర్ దాడి తోట బాషా అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి రావడంతో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ బాలనాగి ఎర్నాగప్ప ఇంటికి వెళ్లి మాట్లాడి తేనీటి విందు స్వీకరించారు. పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ నాగేశ్వరరావు, మండల కన్వీనర్ ఖాదర్‌వలి, వైస్ సర్పంచ్ గవ్వల శ్రీరాములు, బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ ఫణీంద్ర, వలంటరీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి జయరామిరెడ్డి, మండల కన్వీనర్లు పూల ప్రసాద్, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు బాలనాగి బయన్న, జిల్లా యువజన విభాగం నాయకులు సోహెల్, గవ్వల ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

పుట్లూరు: మండలంలోని కోమటికుంట్ల గ్రామానికి చెందిన డీజిల్ బాబు అనే వ్యక్తికి చెందిన కిరాణా షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి సమయంలో షాపు తాళాలను పగులగొట్టి రూ.10500 నగదును చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. అయితే షాపు వద్ద ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా వైఎస్సార్ జిల్లా నుంచి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేయడానికి కోమటికుంట్లకు వచ్చిన ఓ వ్యక్తి ఈ చోరీకి కారణం అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యర్రగుంట్లలో పారిశుధ్య పనులు

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో శుక్రవారం పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా పంచాయతీ అధికారి మంజునాథ్ మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలు వస్తున్న నేపథ్యంలో దోమలు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా అపరిశుభ్రత తొలగించామన్నారు.

ఆర్డీటీ పరిరక్షణకు మహా పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న గోవిందు తదితరులు

గుత్తి: ఆర్డీటీ పరిరక్షణ కోసం జిల్లా ప్రజా ఉద్యమ నేత సాకే గోవిందు శుక్రవారం మహా పాదయాత్ర చేపట్టారు. పామిడి మండలం గజరాంపల్లికి చెందిన ప్రజా ఉద్యమ నేత ఆయన జిల్లా సరిహద్దు ప్రాంతమైన కరిడి కొండ గ్రామం వద్ద నుంచి మహా పాదయాత్ర ప్రారంభించారు. గుత్తిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్, రామాంజనేయులుతో పాటు ప్రజా సంఘాల నాయకులు, ఆర్డీటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ ఆర్డీటీకి విదేశాల నుంచి నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం మోకాలొడ్డడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సు రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 8న అనంతపురంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు.

రక్తదాన శిబిరాలకు స్పందన

గుంతకల్లుటౌన్: ముస్లింల ఆరాధ్యదైవం మహమ్మద్ ప్రవక్త జన్మదినం (మిలాద్ ఉన్ నబీ పండుగ) సందర్భంగా రెడ్‌డ్రాప్ రక్తదాతల సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మూడు ఏరియాల్లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించింది. రక్తదాన శిబిరాలను ముస్లింల పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్, టూటౌన్ సీఐ మస్తాన్ ప్రారంభించారు. మున్సిపల్ ఆఫీసు, ఆర్అండ్‌బీ సర్కిల్, మస్తాన్‌వలి దర్గా ఏరియాల్లో నిర్వహించిన శిబిరాల్లో మొత్తం 287 మంది పాల్గొని రక్తదానం చేసినట్లు రెడ్‌డ్రాప్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.రెహమాన్ తెలిపారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్, ప్రైవేట్ బ్లడ్‌బ్యాంక్‌లకు రక్తం యూనిట్‌లను అందజేసామన్నారు. రక్తదాతలందరికీ సంస్థ తరపున ప్రశంసాపత్రాలను, పండ్లు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు గులామ్ మహమ్మద్, కార్యదర్శి షఫీ, వివిధ రక్తదాతల సంస్థల ప్రతినిధులు తిప్పన్న, ఇస్మాయిల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ ఖాజీ రజాక్‌పీర్‌సాబ్, టూటౌన్ సీఐ మస్తాన్

రైతుపోరుతో బాబుకు కనువిప్పు కలగాలి

బుక్కరాయసముద్రం: రైతుల సమస్యలపై ఈ నెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే రైతు పోరుతో చంద్రబాబుకు కనువిప్పు కలగాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన రైతు పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు సాగునీరు, ఎరువులు, విత్తనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చంద్రబాబు రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకులు దోచుకోవడానికి తెరలేపారన్నారు. 10వ తేదీ జిల్లా పర్యటనలకు వస్తున్న చంద్రబాబుకు కనువిప్పు కలిగేలా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే రైతు పోరును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, సర్పంచ్ పార్వతి, నాయకులు వెంకటరెడ్డి, రాధా మనోహర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పూల నారాయణస్వామి, ముత్యాలశీన, చికెన్ నారాయణస్వామి, ఆది, శివ, అంజి, లక్ష్మిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

7న ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

గుంతకల్లు: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఈ నెల7న పురస్కారాలు అందజేస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ రాజ్‌కుమార్, సీపీఎస్ సబ్ కమిటీ కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం గుంతకల్లులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ, బోధనలో విశేషమైన సేవలు అందిస్తూ విద్యార్థుల భవితకు బాటలు వేసిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 67 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను ఉత్తమ పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. గుంతకల్లు మండలంకు చెందిన ఉపాధ్యాయులు లక్ష్మీరంగమ్మ, శంకర్‌నాయక్ అవార్డులకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరం యూటీఎఫ్ జోన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటుడు వెల్లంకి నాగినీడు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, రవిబాబు, శంకరయ్య, రామ్మోహన్, కల్పన గిరిబాబు, ఎల్లన్న, అబ్దుల్ రఫీ, సిద్దయ్య, తిమ్మారెడ్డి, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి'

గార్లదిన్నె: వినాయక నిమజ్జనం సందర్భంగా విడపనకల్లు మండలంలో దళితులపై దాడులు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు లోలూరు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉల్లిగన్నను శుక్రవారం ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విడపనకల్లు మండల కేంద్రంలో వినాయక నిమజ్జనంలో ఎస్సీ కులానికి చెందిన యువకుడు ఉల్లిగన్నపై అదే గ్రామంలోని అగ్రకులానికి చెందిన వారు దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ వెంటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి లింగమయ్య, రామాంజనేయులు, ఆదెన్న తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ లభ్యం

గుత్తి: మండల పరిధిలోని కరిడి కొండ గ్రామంలో అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యమైంది. వివరాలు.. గత నెల 27న బాలిక అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీఎస్ఐ గౌతమ్, పీసీలు భాస్కర్ నాయుడు, మహాలక్ష్మి గురువారం రాత్రి బాలిక ఆచూకీ కనుగొన్నారు. విజయవాడ వెళ్లి బాలికను అదుపులోకి తీసుకుని గుత్తికి తీసుకొచ్చారు. శుక్రవారం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసులను సన్మానించారు. ఎస్ఐ సురేష్, పీఎస్ఐ గౌతమ్, పీసీలు భాస్కర్ నాయుడు, మహాలక్ష్మిలను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

పామిడిలో దొంగల హల్‌చల్



పామిడి: పామిడి పట్టణంతోపాటు సమీప కాలనీల్లో రాత్రి వేళ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మరిముఖ్యంగా బైపాస్‌కు సమీపంలోని సరస్వతీ విద్యా మందిరం కాలనీ, మదీనా కాలనీ, గుండప్పరావు కాలనీ, గుప్తా కాలనీ, వెంగమనాయుడు కాలనీల్లో అర్ధరాత్రి దాటిందంటే దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లు, పార్కింగ్ చేసిన వాహనాల్లో చోరీలు చేయడం దొంగలు పనిగా పెట్టుకున్నారు. ఇటీవల సరస్వతీ విద్యా మందిరం కాలనీకి సంబంధించి రోడ్డుపై పార్కింగ్ చేసిన సెంట్రింగ్ భవన నిర్మాణ కార్మికుడు శివకుమార్‌కు చెందిన ఆటోలో రూ.5 వేలు విలువ చేసే బ్యాటరీని ఓ వ్యక్తి చోరీ చేశాడు. గతంలో స్థానిక వెంగమనాయుడు కాలనీలో నివాసముండే ఫొటో స్టూడియో నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి ఇంట్లో లక్షలు విలువ చేసే నగదు, నగలు దొంగతనానికి గురైన విషయం పాఠకులకు తెలిసిందే. అలాగే గుండప్పరావు కాలనీలో ఓ టీచర్ ఇంట్లో చోరీ విఫలమైన విషయం విదితమే. దీనికితోడు రాత్రి వేళ బైపాస్‌లో దిగి ఆయా కాలనీల్లోని ఇళ్లకు వెళ్లే ప్రయాణికులకు దొంగల బెడద పొంచి ఉంది. మరిముఖ్యంగా మహిళా ప్రయాణికులకు ఈ దొంగల వల్ల ప్రాణహాని సైతం లేకపోలేదు. దీనికితోడు అర్ధరాత్రివేళ ఆయా కాలనీ ప్రజలకు అత్యవసర పని ఉంటే భయంగా రావాల్సిన దుస్థితి నెలకొంది.

మందుబాబుల బెడద..

ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోలును సైతం దొంగలిస్తున్నారు. దీంతో ఆయా కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ మజారా కాలనీలు ఎన్‌హెచ్-44కు ఆనుకుని ఉండడంతో దొంగలు సునాయసంగా దొంగతనాలు చేసుకొని బైపాస్ గుండా పారిపోతున్నారు. దీనికితోడు ఈ కాలనీల్లో కొందరు మద్యం బాటిళ్లతో హల్‌చల్ చేస్తూ ఆయా కాలనీలకు వెళ్లే ప్రజలకు, మహిళలకు తలనొప్పిగా మారారు. ఆయా కాలనీల్లోని మూడు రోడ్లు కలిసే ప్రాంతాల్లో చేతబడి వంటి కార్యక్రమాలు చేపడుతుండడంతో కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో ఈ కాలనీల్లో పోలీసులు ముమ్మర గస్తీ నిర్వహించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసులు రాత్రి వేళ గస్తీని విస్మరించారు. దీంతో రాత్రి వేళ దొంగతనాలతో పాటు బైపాస్ మీదుగా 40 అడుగుల రోడ్డుపై యథేచ్ఛగా సహజ వనరులైన ఇసుక, గరుసును అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు తక్షణం స్పందించి దొంగతనాలతో పాటు అక్రమ ఇసుక, గరుసు రవాణాను అరికట్టాల్సిన అవసరమెంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.